

# ఊడల్లేని మర్రి

స.వెం. రమేశ్

“ఇంత పెద్ద మఱ్రిమానుకి ఒక్క ఊడ గూడా లేదేంది నా? ఇదసలు మఱ్రి మానేనా?” నా మనసులోని సందేహాన్ని శీనడు కూడా బయటపెట్టినాడు. ‘ఇదేందో కనుక్కోవల్సిన మందలేన,’ని మిద్దె దిగి మాను దగ్గరికి పోయినాను.

పదిమంది చేతులు పట్టుకొని చుట్టుకొంటే కూడా చాలనంత పెద్ద బుడము. ఆ బుడము పది గజాలపైన నాలుగు కొమ్మలయి, నాలుగు కొమ్మల నుంచీ పదులు పదులుగా చిరుకొమ్మలు పుట్టి, చిరు కొమ్మలు చీలి నూర్లు నూర్లుగా రెమ్మలయి, రెమ్మ రెమ్మకూ వేలవేల ఆకులు చిగురించి, పచ్చని ఆకుల కొసన ఎఱ్ఱెఱ్ఱని పండ్ల గుత్తులు వేలాడి, గుత్తుల్లోని పండ్లను పిట్టొకటి పొడిచీ ఉడతొకటి కరిచీ...

“సామీ! ఆరతి కండ్లద్దుకోప్పా,” అన్న పిలుపుతో ఈ లోకంలోకి వచ్చినాను. ఎదురుగా ఎవరో నల్లని బక్క మనిషి, చేతిలో ఆరతి మూకుడు, మట్టిదే. కళ్ల కద్దుకొని మానుకిందనే నాపరాతి తిన్నె మీద కూచున్నాను.

మల్లా మాను ఆలోచనలు ముసురుకున్నాయి. మఱ్రిపండ్ల మాను పైన పిట్టలు, ఉడతలు, తొండలు, బల్లులు. మానుకింద బుట్టలల్లుకొంటా నాలుగయిదు ఎరకలోళ్ల కుటుంబాలు. మూడంటే మూడే అడుగుల ఎత్తులో మూడు దిక్కులా మూడు పలకరాళ్లు నిలబెట్టి, పైన ఇంకొక రాతిని కప్పుగా వేసిన చిన్న గుడి. గుడిలో పసుపు కుంకుమలు నిండుగా పూసుకొన్న ఇంకొక చిన్న రాయి. మాను కిందా మిందా గలగలమని ఒకటే సందడి. అబ్బ! ఎంత పెద్ద మానిది. పట్నంలో కోయంబేడు సంత దగ్గర కొత్తగా కట్టిన పెట్టిండ్లలో కూడా ఇంత సందడి ఎరగను నేను.

“యాల సామీ! యల్లమ్మ మానుని అట్టే సూస్తా ఉండావు?” ఇందాక ఆరతిచ్చిన బక్కమనిషి నా పక్కన కూచుంటా అడిగినాడు.

“ఇంత పెద్ద మఱ్రిమానుకి ఒక్క ఊడ కూడా లేదే, యాల? అని యోచన చేస్తా ఉండానన్నో,” బదులిచ్చాను.

”ఇది యల్లమ్మ మాను సామీ. ఆ యమ్మ ఒగరికి తోడయి నిలిసిందిగానీ యాపొద్దన్నా ఇంగొకరి తోడు కోరెనా సామీ. ఇల్లువాకిలీ అనుకోకుండా ముక్కు మూసుకొని మాను కింద కూకోనుండే మొగునికి అన్నీ అమిర్చి పెట్టినా కడ సీలా మింద నింద మోపి సాగనంపెనా, నన్ను కుడిపి సాకి పెద్దమనిసిని చేస్తే ఆ కొడుకు అబ్బ మాటిని తల నరికిడిసెనా, ఎవురు సామీ ఆ యమ్మకు తోడయి నిలిసింది? యా జాతోడూ సేరిపీక పోయినా మా మాదిగజాతి సేరిపిచ్చుకొనిందని మప్పిదంతో ఈ పొద్దుటికీ మా ఇండ నడాన పడుండాదే! మేమేమన్నా ఐవార్లట్లా ఆ యమ్మకు ఎడేసి పూజలు సెయిబోతామా, యాడాది కొక్కిత్త ఎనుముపోతునో గొరి పొట్లినో కొట్టి ఆ యమ్మకు సూపిచ్చి ఈ పాడుకడుపులకే గదా పెట్టుకొంటుండాము. అంత మట్టుక్కే మా ఇండ్లల్లా ఆడబిడ్డ యాగటయినా, చిన్నోల్లకి వేకయినా, గేరంతా వాంతీ బేదుల్తో గిలగిలమన్నా ఆ యమ్మే గదా కడుపులో పెట్టుకొని కాపాడతుండేది.”

నేను నోరు తెరుచుకొని ఇంటా ఉండాను ఆ యన్న మాటల్ని. నన్ను పట్టించుకోకుండా చెప్పుకొని పోతుండాడు.

“ఇద్దో ఈ మానైన మీటకీ ఆ యమ్మ అట్లే సామీ! ఇన్ని గువ్వలకు గూడయిందా, ఇన్ని జీవాలకు మేత

యిందా, ఇన్ని కాపరాలకి ఇల్లయిందా, ఆ యమ్మ ఆద రవుకి పరక కడ్డంత ఊడని దింపుకొనిందేమో సూడి. మా యల్లమ్మ బతుకే అట్లాది. ఊడల్లేని మఱ్రిమాను ఆ యమ్మ.''

*

ఆపైనుండే పెద్దాయన మనల్ని ఈ నేల మీదికి పంపిచ్చేముందు అడగతాడంట, 'ఒరే! నువ్వు భూమ్మీద ఏంగా ఉండబోతావు?' అని. కొందరు 'నేను కోటీస్ప రుడిగా ఉండాల'ని, 'నేను ఆంధ్రపరదేశానికి ముక్కు మంతిరిని కావాల'ని, 'నేను బూమండ లాన్నేలే మొగలాయి కావాల'ని జంబంగా అడగతారంట. కొందరు మటుకు మప్పిదంగా, 'నువ్వు ఏంగా ఉండ మంటే అట్నే ఉంటాను సామీ,' అంటారంట.

అందరి మాటలూ విన్న పెద్దాయన, మట్టసంగా మప్పిదంగా ఉండినోళ్లని మొగలాయిగా బతకమని చెప్పి, జంబాలకారి పిందెలని, 'పుట్టినూరు, పెరిగినూరు ఎరక్కుండా తిరిగి తిరిగి చావండ్రా నాయాళ్లారా,' అని పంపిస్తాడంట. ఇదంతా నాకు మా తాత చెప్పినాడు.

నేను కూడా ఆ జంబాలకారుల్లో ఒకడినని చెప్ప డానికే ఈ మందలంతా. నా గతి కూడా అట్నే అయి పోయె కదా! పుట్టిందేమో ప్రళయకావేటి పల్లెలో. పెరి గిందీ చదివిందీ పట్నంలో. పదేళ్లుగా కుదురుకోనుండేది పట్నానికి పడమట. ఇన్నూరు మైళ్ల దూరంలోని హోసూరులో.

ఈ పొద్దుటికి ఈ పొద్దు ఈ పళంగా నేను ప్రళయ కావేటి పల్లెలకి పోతే నన్ను గురుతుపట్టి పలకరించే మానవుడు లేడు అక్కడ. అయిన పోయినోళ్లందరూ పోగా మేలుగోరే మేనమామ ఒక్కడు మిగిల్నాడు పేటలో. ఏడాదికొకటే ఆడి కిర్తికన్నట్లు ఎప్పుడో ఏడాదికో ఆరునెలలకో ఒక తూరి ఆయన్ను చూసేదానికి పేటకు పోతుంటాను. అదేపనిగా కూడా కాదు. ఏ విజయ వాడకో పట్నం మీద పోవాల్సిన పనిబడినపుడు మటుకే. మా మామ అప్పటికీ అంటానే ఉంటాడు, 'నీది మూట దింపుడు ప్రయాణమేగానీ మాట దింపుడు ప్రయాణం కాదురా,' అని. అంటే వచ్చినంత బిరాన తిరుక్కుంటా నని ఆ ఎత్తిపొడుపు.

ఆ పొద్దూ అట్నే పొద్దు పుట్టే సమయానికి పేటకు పొయ్యి, ఉడుకునీళ్లు కాళ్ల మీద పోసుకొన్నట్టు మద్ది నేళకు ప్రయాణం కట్టినాను. మామ చిటపటమంటానే ఉద్దిపప్పు ఊరిబిండి, ఉల్లగడ్డల పిట్టు, వడిమేసి తిరగ బోసిన పప్పులుసులతో కమ్మంగా వండిపెట్టినాడు. తిని 'పినాకిని'లో విజయవాడకు పోవడానికి రైలు నిల యానికి చేరుకొన్నాను.

కత్తిరి నెల మద్దినేళ పరంటగాలి దెబ్బకు సరుకు వెలపోక చతికిలబడ్డ గుగ్గిళ్ల శెట్టి అంగడి మాదిరిగా, మాసినెల మొయిళ్లు లేక వట్టిపోయిన మిన్నులాగా దిగులుగా, దిగాలుగా ఉండాది రైలు నిలయం. నడ మేడలు రెండూ జనం లేక బోసిపోయి ఉండాయి. నేనె క్కాల్సిన రైలు ఒక జీవితకాలం కాకపోయినా గంట ఆల స్యమని ప్రకటన వచ్చింది.

కడుపులో కమ్మగా కూటెమ్మ దూరింది కదా! కళ్ల కిందకి చల్లంగా తూగమ్మ వచ్చి కూచునింది. నేనొచ్చుం డానని ఎవరు చెప్పినారో! 'అబయా, బాగుండావా నాయినా, ఒక తూరి ఇట్టొచ్చి పోగూడదా?' అని పలక రించి రమ్మని తూరుపుగాలిని పంపినట్టుండాది ప్రళయ కావేరమ్మ. రైలుకట్టకు ఆనుకోనుండే చెరువు మీద నుంచి వచ్చిన తూరుపు గాలి, మా బాపటెద్దు చెయ్యి నాకినట్టు, మా వసంతక్క తల గీరినట్టు అనుపుగా నా ఒళ్లు తవిడింది. నేను కూడా ముదిగారాలు పోతా కాళ్లు చాపుకొని చెక్కబల్లకు జారిగిలపడినాను. మాగన్నుగా కునుకు పట్టింది.

''నాయనా, దరమం చెయ్యి తండ్రీ! ముసిల్దాన్ని నాయనా, ఏదన్నా ఇచ్చి పుణ్ణెం కట్టుకో అయ్యా,'' నా కాళ్ల దగ్గర బలహీనంగా వినిపించిందొక గొంతు. దినా నికి ఇట్టాంటి గొంతులెన్నో వినీ వినీ వాడుకబడిపోయిన చెవులకు ఆ పిలుపు ఏమీ కదిలించలేకపోయింది.

ఈసారి ఇంకా దీనంగా అడగతా నా కాళ్లు పట్టు కొనింది ఆ గొంతుగల్ల మనిషి. విసుగ్గా కళ్లు తెరిచి కాళ్లు దగ్గరకు సర్దుకొని కూచున్నాను. నా ఎదురుగా బాగా బక్కచిక్కి నడుము వంగిపోయిన ముసల్ది. ''చిల్లర లేదు పోవా,'' అన్నాను చిరాగ్గా.

''నాయనా! కూడు తిని మూడునాళ్లయింది. అడుక్కొనేదానికి గూడా ఓపిక లేదు. అన్ని టీ నీళ్లకి దుడ్లిచ్చి ఆదుకో తండ్రీ,'' అడగతానే ఉండాది. ఆ గొంతు ఎక్కడ్నో విన్నట్టే ఉండాది కానీ మనిషి గుర్తు తెలియడం లేదు.

నేనిచ్చిన రెండు రూపాయలకు సత్తులోటాలో టీనీళ్లు తెచ్చుకొని, నా కాళ్ల దగ్గరే కూచుని ఆత్రంగా ఆర్చుకొంటూ తాగింది. పోతా ఉండిన ఊపిరి తిరిగొచ్చి నంత నెమ్మది కనబడింది ఆ యవ్వ కళ్లల్లో.

''మీదే వూరు వా?'' కొంచెం తెపరాయించు కొనిచ్చి అడిగినాను.

"ఈ పొద్దుటికి ఇదే ఊరు నాయినా, ఈ కట్టె మట్టిలో కలిసేదాకా ఏ పొద్దు యాడ రాసిపెట్టుంటే ఆడ్నే," వేదాంతం చెప్పింది అవ్వ.

"నిన్ను యాడ్నో చూసినట్టుండాది వా," మల్లా అన్నాను.

"యాడ చూసుంటావు నాయనా? చూసుంటే ఈ పేటలోనే చూసుండాల. ఒకప్పుడు ఈ చెల్లమ్మంటే పెద్ద పెద్దోళ్లే అదరతా ఉణ్యారు. నలగరికి సకాయం చేసిన చెయ్యేగానీ ఒకరి కింద సాచిన చెయ్యికాదు. కడా కాలానికి ఈ కట్టికి ఈ గతి పట్టి ఊడల్లేని మర్రిమాన యింది," అవ్వ చెబతా ఉంటే వీరదాడుతో వీపున ఛళా మని చరిచినట్లయింది.

"అవా! నువ్వు ఇడ్లీ అంగడి చెల్లవ్వవు కదా?" నాకు గుర్తుకు వచ్చేసింది. ఆ యవ్వ ఇడ్లీలు, వడలు అమ్మకొని బ్రతుకు నడుపుకొంటా ఉండిన చెల్లవ్వ. మల్లా ఆత్రంగా అడిగినాను. "అవ్వా! నువ్వేంది వా ఈ మాదిరిగా, అల్లెక్క యాడికి పొయ్యింది? సత్యం ఏం చేస్తా ఉండాడు?" అని.

"ఇంకేడ అల్లెమ్మ నాయనా! ముదరష్టపు వాంతీ బేదీ వచ్చి ఆ యమ్మిని మట్టగించేసింది. ఆ సత్తిగాడ మందల దేనికడగతావు. నన్ను ఇట్ట కడగండ్ల పాలు చేసింది ఆ నాబట్టే గదా!" నా చిన్న పలకరింపుకే వలవల ఏడస్తా బదులిచ్చింది చెల్లవ్వ.

ఏనాటి చెల్లవ్వ! ఎట్టాంటి చెల్లవ్వ!

*

ప్రళయకావేట్లో ఎగిరి పేటలో పడిన ఎన్నో కుటుంబాలలో చెల్లవ్వ వాళ్ల కుటుంబం కూడా ఒకటి. అటకాని తిప్పకు దక్షిణంగా ఉండే పెద్దకయ్యలోని అయిదారు దీవులకూ చెల్లవ్వ మంత్రసాని. వేనాడ, మూల, వేనాటి కుప్పం, ఇరకం, ఇరకం కుప్పాల్లో ఏ ఆడమనిషి పురిటినొప్పులతో కేకవేసినా అక్కడ చెల్లవ్వ ప్రత్యక్షమయ్యేది. ఏమి మాయ చేసేదోగానీ అడ్డం తిరిగిన బిడ్డను కూడా గడ్డకు చేర్చి కానుపయ్యేట్టు చేసేది.

కానుపయినాక కలిగిన ఇళ్లల్లో రూకో, కోకో దొరికేది. పేదకొంపల్లో వాళ్లు, బిడ్డకు నీ పేరు పెట్టు కుంటాము చెల్లక్కా,' అంటే నవ్వేసి వచ్చేసేది. అట్ట ఆ నాలుగయిదు దీవుల్లో లెక్కలేనంతమంది చెల్లమ్మలు, చెల్లయ్యలు పుట్టుకొచ్చినారు.

మొగుడు చచ్చిపోయినాక ఉండూరులో ఉండ లేక, ఉండే రెండెకరాల కయ్యను అమ్ముకొని, ఎదిగిన కూతురు అల్లెమ్మని తోడుకొని పేటకొచ్చేసింది. అప్పు డప్పుడే అరాకొరా ఇళ్లు పడతుండే స్వతంత్రపురంలో ఇరవై అంకణాల నేల కొని ఇడవల కప్పుతో ఇల్లు కట్టు కొనింది. రెండు బర్రిగొడ్లను కొని ఇక్కన పక్కన వాళ్లకు పాలు పోసుకొంటా, తెల్లారి ఇడ్లీలు, వడలు; మాపటేళ మూసుంటలు, మణుబూలు కాల్చి అమ్ముకొంటూ బ్రతుకును వెళ్లదీసేది.

అమ్మా కూతుళ్లిద్దరూ కానగమాను మీదుండే కాకి లేవకముందే, కాటనుమిల్లులో శంకు పట్టక ముందే, రాఘవయ్యపేట మసీదులో అల్లా అరవక ముందే నిద్దర లేస్తారు. చెల్లవ్వ మొకాన నీళ్లు చల్లుకొని, పొయ్యిలోని బూడిద కచికతోనో బొగ్గుముక్కతోనో పళ్లుతోమి బరిగొడ్ల కాడికి పోతాది. కళ్లాపికి రెండు పేడ కడలు పక్కనపెట్టి, రెండు చేతులతో కసువూ పేడా జవిరి దిబ్బలో వేస్తాది. మల్లా కాళ్లూ చేతులూ కడు క్కోని, బరిగొడ్ల పొదుగు కడిగి పాలు పిండి, పావుసేరు అద్దసేరు చెంబుల్లో కొలతగా పోసుకొని, బుట్టలో పెట్టుకొని బయలుదేరతాది.

చెల్లవ్వ టకటకమని తలుపుకొట్టి పిలిస్తే, మంచంలో ముడుక్కొని పడుకొన్న ముసలమ్మయినా, మొగుడి పక్కన వెచ్చంగా పడుకొన్న పడుచుపిల్లయినా, పగలు పొద్దులస్తం ఇంటెడు పనిచేసి రెయ్యి బిడ్డలను సతాయించి ఏ నడిరేతిరో కునుకు తీసిన ఇల్లాలయినా ఉలిక్కిపడి లేచేది. 'ఒరె ఒరె ఈ చెల్లదీ అల్లిదీ ఈపొద్దు గూడా నాకంటే ముందు లేసేసినాయే!' అనుకుంటా నాలుక్కరుసుకొని, నోరు తెరుసుకొని, 'కా... కా...' అంటుంది ఆదరాబాదరగా కానగమాను కాకి. 'నేను గూడా లేసేసినాన్లే,' అని రెక్కలు టపటపలాడించి 'కొక్కొరోకో,...' అంటుంది రాఘవరెడ్డోళ్ల కోడిపుంజు. 'హరే హప్పుడే ఐదూ అయిందీ,' అంటా దెబదెబ లేచి అల్లా ఊదను పోతాడు ప్యారే సాయిబు.

చెల్లవ్వ పాలుపోసి వచ్చేసరికి అల్లెక్క ఇల్లూ, వాకిళ్లు చిమ్మి, కళ్లాపి చల్లి ముక్కర్ర వేసేసి ఉంటాది. ఇంక అమ్మాకూతుళ్లిద్దరూ కలిసి అంగడి పనికి మల్లు కొంటారు. పొయ్యిగడ్డ అలుక్కోనూ, వడలకు ఉద్ది పప్పు, పచ్చడికి బద్దపప్పు రుబ్బుకోనూ, ఇడ్లీ గిన్నెలు, చిదుగులు, కట్టిపేళ్లు పొయ్యి దగ్గర పెట్టుకోనూ... ఇన్ని పనులు అవతా ఉండగానే, 'ఈ నా సవుతులు ఒక దినమూ యామారేది లేదమ్మా,' అని తిట్టుకొంటూ తూరుపున పొద్దు పుడతాది. పొద్దు పుట్టేటప్పటికే చెల్లవ్వ పొయ్యిలో అగ్గి పుడతాది.

ఆడ నుంచి ఒకటే మాపన జపం. అల్లెవ్వ అంగట్లో రూపాయికి పదహారు ఇడ్లీలు, రూపాయికి ఎనిమిది వడలు. చెల్లవ్వ ఇడ్లీ అంగడి ఉండినన్నాళ్లూ స్వతంత్రపురంలో ఏ ఇంట్లోనూ పొద్దునపూట పొయ్యి వెలిగుండదనుకొంటాను, కాపీ నీళ్లకు తప్పితే. నాకు తెలిసి మా యమ్మ కూడా ఏ పొద్దూ మా ఇంట్లో నాస్తా చేసింది లేదు. నేను శెలవులకి ఎప్పుడన్నా ఇంటికొచ్చి నప్పుడు తెల్లారి లేచి తట్టెత్తుకొని చెల్లవ్వ ఇంటికి పోయి, నాలుగిడ్లీలు రెండు వడలు తిని అర్ధరూపాయి చెల్లవ్వ చేతిలో పెట్టేవాడిని. చెల్లవ్వ నేనిచ్చిన అర్ధరూపాయి తట్టు అదొక మాదిరిగా చూసి, "ఇపిట్నించే అమ్మా అబ్బలకి మిగలబెట్టకపోతే ఇంకొక నాలుగిడ్లీలు తిని బలువేమిరా బక్కనాబట్టా," అనేది.

జంగిటోడు గొడ్లిప్పే వేళకి అంగడి పని అయిపో తుంది. గొడ్లను విప్పి జంగిటోడికి తోలి, అల్లెక్క ఇంటి పనిలో పడితే, చెల్లవ్వ ఇక్కన పక్కన ఇళ్లకు పోతాది. అమ్మలక్కలతో పెత్తనాలకనుకునేరు. వాళ్లిళ్లల్లో పనీ పాటలేమైనా ఉంటే చేసేదానికి. బియ్యం చక్కబెట్టనో, పిండి దంచనో, అప్పచ్చులు కాల్చనో, గుడ్డలుతకనో, ఈల బందర కొట్టనో, పసిబిడ్డలకి పైకి పోయనో, ఏదో ఒక పనిమీద ఎవరో ఒకరు పిలస్తానే ఉంటారు. అల్లెక్క కూడా ఇంటిపని బిరబిర కానిచ్చి వచ్చి చెల్లవ్వ చేతి పనిని అందుకుంటాది.

అంత పనీ చేసినాక దుడ్డు తీసుకోబోతారా ఏమి? లేనే లేదు. పని చేయించుకొన్న పుణ్యాత్మురాలు తల్లీకూతుళ్లకు అంత ముద్ద పెడితే అదే పదివేలు. అది కూడా చెరొక పిడచ తిని లేచిపోతారు. ఎప్పుడన్నా మా యమ్మ తిడతా, "అల్లెమ్మా, చెరొక పట్టిడన్నమన్నా కడుపునిండా తినండేమి, పొయ్యేటప్పుడు ఎత్తుకోని పోబోతారా!" అనేది.

"వొద్దు రెడ్డెమ్మా వొద్దు. ఈ పొద్దు పెద్ద చెయ్యి తల్లివి నువ్వు పెడితే తినేసి, రేపు ఇంకొక తల్లిని పెట్ట లేదని తిట్టుకోబోతాము. అయినా మాయి కడుపు నిండా తినే బతుకులు కాదు తల్లా, పేగు ఎండకుండా తినే బతుకులు. ఇద్దో ఈ యమ్మిని ఎవురో ఒక మకానుబావుడి చేతలో పెట్టాలగదమ్మా. ఈ పొద్దు నేను కడుపు ఎండగట్టుకోకపోతే రేపు దాని బతుకు ఎండ గట్టనా," అనేది చెల్లవ్వ.

పొరుగిళ్లల్లో పనులు లేనప్పుడు అమ్మా కూతు ళ్లిద్దరూ తడాకులు ముందరేసుకుని కూచుంటే, పైటేళకు వంద కట్ట కుట్టి లేచేవారు. జంగిటోడు గొడ్లను తోలుకొచ్చే వేళకి పనులు ముగించుకొని, అడుసులో పొల్లాడి వచ్చిన గొడ్లని కడిగి, పాలుతీసి చెల్లవ్వ ఎత్తు కొనిపోతే, అల్లెక్క సంద ముక్కర వేసి, పొయ్యి ముట్టిం చేది. మాపటేళ మల్లా మూసుంటలూ, మణుబూలు కాల్చి అమ్మేవాళ్లు.

ఆ నిప్పుల మీదే చిట్టెడు బియ్యం ఉడకేసి పెట్టుకోని, పొద్దుబొయినాక పొంతకుండలోని ఉడు కుడుకు నీళ్లతో పైకి పోసుకొని, ఉడకేసిన కూటిలో అంత ఊరుబిండో, అన్ని గంజినీళ్లో కలుపుకొని పేగు మంట ఆర్చుకునేవాళ్లు. చెల్లవ్వ వాళ్ల దినచర్య దాదాపు అన్నినాళ్లూ ఇట్నే ఉండేది.

పేటకొచ్చిన మూడేళ్లకు మీంజూరులో శేషయ్యకు అల్లెక్కనిచ్చి పెళ్లి చేసింది. అమ్మా అబ్బాలేని శేషన్నని ఇల్లిటం పిలుచుకొనొచ్చి, కరంటాఫీసులో తెలిసినోళ్ల కాళ్లూ గడ్డాలూ పట్టుకొని లైనుమేను పని తీసిచ్చింది.

ఏ చెడువాడికా లేని శేషన్న నెలజీతం తెచ్చి ఇంట్లో ఇస్తుంటే, ఇంకొక రెండు బర్రిగొడ్లను కొని నెమ్మదిగా బ్రతుకుతుండినారు. 'కలిసొచ్చే కాలానికి నడిసొచ్చే కొడుకు పుట్నెట్టు, కడాకాలన నన్ను కడ తేర్చేదానికి నా ఇంటికొచ్చిన దేవుడమ్మా నా అల్లుడు,' అని శేషన్న గురించి అందరితో గొప్పగా చెప్పుకొనేది చెల్లవ్వ. పెళ్లియిన ఏడాదికే అల్లెక్కకు సత్యం పుట్టి నాడు. చెల్లవ్వ మనుమడిని ముదిగారంగా చూసు కొనేది.

గుట్టుగా ఉండేవాళ్లని గుట్టుగా ఉండనిస్తే ఊరా పేరా ఆ దేవుడికి! వాళ్లని వీధుల్లోకి లాగి వీరంగం ఆడి పిస్తేనే కదా వాడికి కుశాల.

సత్యానికి రెండేళ్ల వయసప్పుడు, దిడీలున ఒక నాడు శేషన్న కరెంటు కంబం మీద నుంచి పడి ఊపిరి వదిలేసినాడు. అల్లెక్క, చెల్లవ్వలు గుండెలు బాదుకొని ఏడిచినారు. ఎంత ఏడిస్తే శేషన్న తిరిగి రాబోతాడు? రాని శేషన్న కోసం ఎన్ని పొద్దులు ఏడవబోతారు? తల చెదిరిన కూతురినీ ఉగ తెలియని మనుమడినీ చూసి ముందుగా చెల్లవ్వే సమాళించుకొనింది. అల్లెక్కను సమాళించింది. మల్లా బతుకుబండిని బాట ఎక్కిం చింది.

కరంటోళ్లు ఇచ్చిన దుడ్లతో డేగలపాళెంలో రెండ కరాల కయ్య కొని కోరుకిచ్చింది. 'ఈ ఇల్లొదిలి పై ఇంటికి పొయినాక కూడా యాడాదికి పుట్టిడొడ్లు బత్తెం ఇచ్చిపొయినాడు నా అల్లుడు,' అని అడుగడుక్కూ శేషన్నను తలుచుకొనేది చెల్లవ్వ.

ఆ అమ్మా కూతుళ్లిద్దరూ కడుపు కట్టుకోని సత్యాన్ని సాకినారు. నాలుగిళ్లల్లో నాలుగు రకాల కూరలు, పలారాలు తెచ్చి అడిగిన వేళకు అడిగింది పెట్టినారు. కోరిన వేళకు కోరింది కొనిచ్చినారు. సత్యం పెరిగి పెద్దోడవతా ఉండాడు.

ఒకనాడు ఇంటి చోటు దగ్గర చెల్లవ్వకు, రాఘవరెడ్డోళ్లకు తగువు పడింది. చెల్లవ్వ నోరు చేసుకొని అరిచింది. రాఘవరెడ్డి కొడుకు సూరికత్తెత్తుకొని చెల్లవ్వ మీదకు వచ్చినాడు. చెల్లవ్వ తెంపుగా తిరగబడింది. పెనుగులాటలో చెల్లవ్వ రెట్టకు గాయమయింది. నెత్తురు కారే గాయంతో ఆపట్నే పోలీసోళ్ల దగ్గరికి పోయి కేసుపెట్టి వచ్చింది. ఇంకొకనాడు దొంగలు ఇంటికి కన్నం కొడతుంటే గొడ్డలెత్తుకోని దొంగల్ని తరిమింది. బొమ్మి రామయ్య కొడుకు అల్లెక్క చెయ్యి పట్టుకొన్నాడని తెలిసి, చింతమెల్లితో వాడిని వాయగొట్టింది. ఇట్ట ఆడదిక్కు, మగదిక్కు తానే అయి ఆ కుటుంబాన్ని సాకి సంతరించింది చెల్లవ్వ.

నేను కూడా పదోతరగతి వరకే అప్పుడప్పుడూ పేటకు పోతుండినాను. ఆనక పొయ్యేది దాదాపు చాలించుకొన్నాను. పోయినా 'హో దడుపు వాన ఒక్క తూరే,' అన్నట్టు ఏ ఏడాదికొకసారో, అంతే. ఈ పదైదేళ్లలో చెల్లవ్వ వాళ్ల మందలే తెలియదు. ఇదుగో ఇప్పుడిట్లా ఎదురుగా...

*

"నన్ను ఇన్ని మాటలు ఇసారిస్తుండావు. ఇంతకీ నువ్వెవురు నాయినా?" ముక్కు చీదుకుంటూ అడిగింది చెల్లవ్వ.

"అవా నన్ను గుర్తుబట్లా? రెడ్డెమ్మ కొడుకుని వా," చెప్పినాను.

"నాయినా, నువ్వా కొడుకా! నీకెంత కష్టమొచ్చింది కొడుకా! అమ్మా నాయినా ఇద్దరూ ఒకే తూరి లారీ గుద్ది పొయినారంటగదా నాయినా," రాగాలు తీస్తా బాధపడిందవ్వ.

ఆ యవ్వ అన్ని బాధల్లో ఉండి కూడా నా కష్టానికి కన్నీళ్లు పెట్టుకోవడం చూసి కదిలిపోయినాను.

"అది సరేవా, నీ మందలేంది? నువ్వు దేనికి ఇట్టయిపోయినావు?" అడిగినాను.

"నా కల్లేట్లు దేనికి అడగతావులే నాయినా! నా బతుకు మాదిరి బతుకు పగోడికి కూడా వొద్దు. అంతా నీ సావాసగోడు ఆ సత్తిగాడి పున్నెం. పదోదో పన్నిండోదో తరగతి వరకు పేటలోనే సదివినాక, పట్నం పొయ్యి సదువుకోవాలన్నాడు. పట్నం సదువులంటే మాటలా. 'మనం తూగలేమురా ఏ అయ్యనో ఒకయ్యను పట్టుకోని పన్లో చేరిపిస్తాను. సదువు సాలిచ్చి నాలుగు దుడ్లు సంపాయిచ్చుకొని రారా,' అన్నా ఇన్లా. మకు రేసుకొని కూసున్నాడు. చేసేది లేక ఒప్పుకొన్నాము.

మూడేళ్లో నాలుగేళ్లో సదవాలని పొయినాడు. నెలకో రెణ్ణెల్లకో ఇంటికొచ్చి దుడ్లు తీసుకొని పోతాడంతే. నడిమద్దెలో మొకం సూపిచ్చేది లేదు. వోడి సదువు అయ్యేటపిటికి రొండెకరాల కయ్యా గుడ్డు కారిపొయ్యింది, మా కండలూ కరిగిపొయినాయి. ఇంటి కొచ్చినపుడన్నా ఇంపింతంగా మాట్లాడతాడా అంటే అదీ లేదు. పట్నంలో యాడుండేది చెప్పమంటే చెప్పేదిల్యా.

ఒకనాడు ఏకోజామన ఉబద్దరవ వొచ్చిపడింది. ఉన్నెట్టుండి అల్లెమ్మకి వాంతీ బేదీ పట్టుకొనింది. ఆసపత్రికి తోడకోనిపోతే వోళ్ల వల్లా కాలా. తండారుపేట కలరా ఆస్పత్రికి తోడకోని పొమ్మనేసినారు. కలరా అనేటపిటికి ఇక్కడ పక్కనోళ్లెవురూ సకాయానికి రాలా. నాకూ కాళ్లూ చేతులూ ఆడలా. అట్నే ఆ యమ్మిని జవురుకొని దొంగల బండ్లో ఎక్కించి తండారుపేటకు తొడకోని పోయినా. ఆస్పత్రికి ఆ యమ్మిని ఈ చేతల్తో ఎత్తుకోని ఈ బుజాన మోసుకోని పోయినానబయా. కడాన నా బిడ్డ గోగుపుల్ల మాదిర అయిపోయింది కొడుకా. ఆస్పత్రిలో చేర్చుకొని బులుకోసు బుడ్డి ఎక్కిస్తా ఉండగానే నా బిడ్డ ఊపిరొదిలేసింది నాయినా. ఆ యాసపత్రిలో ఊపిరిపోతే పీనిగని ఇంటికి ఈరంట. అడ్నే మిసినులో పెట్టి కాల్చేసినారు. ఈ ఏడాటపు చెల్లమ్మ కడుపులో పుట్టి ఆ యమ్మి ఏమి బాగు పడింది? కడుపు కింత కవళమా! కంటికింత నిదరా! పని పనంటా దాన్ని ఉడకాడించి సంపినా నబయా," చెల్లవ్వ గొంతు ఏడుపుతో పూడుకుపోయింది.

"ఇంత జరిగినా సత్యానికి తెలవదా వా?" నిదానంగా అడిగినాను.

"వోడు పట్నంలో యాడుండేది ఎవురికి చెప్పినాడబయా. అమ్మ సచ్చిపోయిన నెలదినాలకి దుడ్లు కోసరం వొచ్చినాడు. అల్లెమ్మ సచ్చిపొయిన మందలని నేను చెప్పి చెప్పి యాడస్తుంటే, కసుమాళపు ముండా కొడుకు వోడికి కంట్లో సుక్కనీళ్లు రాలేదబయా. ఆ రేతిరి నా దగ్గిర్నే ఉణ్యాడు. తెల్లారి లేసి రాఘవరెడ్డోళ్ల ఇంటి తట్టు పోతుంటే దేనికో అనుకొన్నా. ఉబద్దరవ తేబోతుండాడని అనుకోలా. పెద్దోళ్లు ఊరికే చెప్పినారాబయా

కాపోని పగ కడదాకా పోదు, కరణం పగ కాటికి పాయినా పోదని. మొదులే రాఘవరెడ్డికి నేనంటే కోపం, వోడేమి చెప్పినాడో? వీడేమి ఇన్నాడో? మద్దినేళ వస్తానే ఇల్లూ ఇంటిచోటు రాఘవరెడ్డోళ్లకి బేరం పెట్టేసినానని చెప్పినాడు. నేను నెత్తీనోరూ కొట్టుకొన్నా. ఈ జానెడు చోటు ఉణ్ణీరా అని మొత్తుకొన్నా. వోడు ఇన్లా. వోడు అనుకొన్నట్టే అమ్ముకొన్నాడు."

"చోటు అమ్మేదానికి నువ్వు దేనికి ఒప్పుకొన్నావవ్వా?" చెల్లవ్వ మాటలకు అడ్డంపడి అడిగినాను నేను.

"నేను ఒప్పుకోలేదు కొడుకా, వోడే వొయినంగా మాట్లాడి ఒప్పించినాడయ్యా. పట్నంలో పెద్ద పని దొరికిందన్నాడు. నేను ఒప్పుకోకపోతే నా మొకం సూడనన్నాడు. ఒప్పుకొంటే పట్నం తొడకోని పొయ్యి పువ్వుల్లో పెట్టి సూసుకొంటానన్నాడు. నేను కూడా కడాదినాల్లో వోడేగదా నాకు ఆసరింపు అని ఒప్పుకొన్నాను.

"నాలుగు నాళ్లు పేటలోనే ఉండి ఇల్లు, ఇంటిచోటు, బరిగొడ్లు అన్నీ రాఘవరెడ్డికి అమ్మి దుడ్లు చేసుకొన్నాడు. ముత్తరాసోళ్ల చెంగమ్మ సుట్టు గుడిసిని ఇరవై రూపాయలకి బాడిక్కి తీసి నన్ను దాంట్లో పెట్టి, పట్నంలో పెద్దిల్లు బాడిక్కి తీసుకోని వొచ్చి నన్ను తొడకపోతానన్నాడు. పొయినోడు అదే పోతా, ఇంకా వస్తా ఉండాడు," నిట్టూర్చి తన కథను నిలిపింది చెల్లవ్వ.

"ఆనెక నువ్వేట్ట చేసినావు వా?" ఆత్రంగా అడిగినాను.

"చేసేదేముండాదబయా! ఒంట్లో సత్తవుణ్ణెంత వరకూ నాలుగిళ్లల్లో పాసిపని చేసుకొని బతికినాను. నడుములు లేవలేని పొద్దుకి ఇదిగో ఇట్ట ఈదల మీద పడినాను," కొంచెం ఆగి ఊపిరి పీల్చుకోని మల్లా చెప్పింది.

"అబయా! పెళయకావేట్లో నించి చూస్తే గెట్టి నేలన ఊడల్లేని మర్రి మానొకటి అవుపడేది. ఆ మాను పిట్టలకి గూడయింది, ఉడతలకి మేతయింది. ఎండ పొద్దులో దోవన పొయ్యేవోళ్లకి సలవ పందిరయ్యింది. ఇంటికొచ్చిన సుట్టాలకి ఇస్తరాకయింది. పేదోళ్ల పొయ్యిలోకి పేళ్లయింది. ఇందరికి ఇన్నయిన ఆ మాను కడాన ఒక గాలివానకు కూలిపొయ్యింది. నాలుగు పక్కలా నాలుగు ఊడలు దించుకొనుంటే ఆ మానుకు ఆ గతి పట్టునా? నా గతీ అట్నే అయింది," వేదాంతమో జీవితానుభవమో చెప్తా ఉండాది చెల్లవ్వ.

నేనెక్కాల్సిన రైలు వస్తుండాది. పది రూపాయల కాగితాలు పది తీసి చెల్లవ్వ చేతిలో పెట్టినాను. ఒక్కటి తీసుకొని తొమ్మిది తిరిగిస్తా, "ఈటిని ఏ పెట్లో పెట్టి బీగం ఏసేది కొడుకా?" అనింది.

"వస్తాను వా," అంటే, "బద్రంగా పొయిరా నాయినా, ఎప్పుడన్నా ఈ చెల్లవ్వను గెవనానికి తెచ్చుకో," అని భద్రం చెప్పింది.

విజయవాడలో మూడునాళ్లు సభలు, సమావేశాలు సందడిగా జరిగినాయి. చెల్లవ్వ మటుకు నా తలలో దూరి కుమ్మరిపురుగయింది. చెల్లవ్వని ఏం చెయ్యాలన్నదే నా ఆలోచనంతా. బాగా ఆలోచించి చివరికి చెల్లవ్వని నాతోపాటు తీసుకొని పోవాలని నిర్ణయానికి వచ్చినాను.

తిరుగు ప్రయాణం పేటమీదనే పోదామనుకొని రైలెక్కినాను. ఎవరూ పట్టించుకోని ఎల్లమ్మకు మాదిగవాడు ఊడయినట్లు, చెల్లవ్వకు నేనొక ఊడనవుతుండాననే సంతోషం నా గుండెల నిండా నిండింది. కోటపోలూరు గెరండాలు దాటతా ఉండగా హోసూరు నుంచి శీనడి ఫోను వచ్చింది.

"అనా! తారుబాటను ఎడల్పు చెయ్యాలని ఈడుండిన మర్రిమానును కొట్టేసినారు నా. బుడంతో గూడా లోడేసినారు. నిన్నంతా గూళ్లు చెదిరిన పిట్టలు, ఇళ్లు చెదిరిన ఎరికలోళ్లు, అంతా అలాజాలంగా ఉండిందినా. ఈ పొద్దు అంతా బోసిపొయ్యి ఉండాది."

నేను బాధగా నిట్టూర్చి, "పోనీలే అబయా! బాధపడబాక. పేట దగ్గిర ఇంకొక ఊడల్లేని మర్రిమాను కనబడింది. తొడకోనొస్తుండా," అని చెప్పినాను.

*ఆదివారం ఆంధ్రజ్యోతి, 11 జూన్ 2006*

